క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ శశికళ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయరాములు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి రానున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే పర్యటన..

మండలంలో బుధవారం నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

నేడు చెక్కుల పంపిణీ

చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని తమ కార్యాలయం వద్ద కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ బుధవారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రానున్నట్లు వివరించారు.

వీఆర్‌ఓకు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ రెవెన్యూ అధికారిగా 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన సవాళ్ల మణయ్యను మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు గాంధీనగర్‌లో ప్రజాపాలనలో భాగంగా వార్డు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పీసీసీ సభ్యుడు బాబర్ అలీ సమక్షంలో పూలమాలలతో సత్కరించారు. మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యాదయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు అలీం షకీబ్, శైలజ, రిసోర్స్ పర్సన్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

6న సమావేశం

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాల మహానాడు తెలంగాణ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 6న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు చిన్న, ఉపాధ్యక్షుడు సత్యయ్య, ప్రధాన కార్యదర్శి అరేందర్, కోశాధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత..తీరేనా చింత


రంగారెడ్డిపల్లి- పరిగి రోడ్డు

గండేడ్: మండల పరిధిలోని పలు రోడ్లు అడుగడుగునా మోకాలిలోతు గుంతలతో ఉండడంతో నిత్యం వాహదారులు పడరాని పాట్లు పడుతున్నారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు జరగకపోవడంతో ఇక్కట్లు తప్పడం లేదు. గ త పాలకులు చిత్తశుద్ధి చూపకపోవడంతో పనుల్లో ప్రగతి కొరవడింది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందని పలువురు వాపోతున్నారు.

కొత్త ప్రభుత్వంపై ఆశలు..

గతంలో అసంపూర్తిగా ఉన్న రోడ్లు, ప్రారంభ కాని రోడ్లన్నీ కొత్త ప్రభుత్వ హయంలోనైనా పూర్తి చేయాలని గ్రామీణులు కోరుతున్నారు. ఇప్పటికైనా తమ కష్టాలు తీరుస్తారని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. త్వరితగతిన పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ఆయా చోట్ల పరిస్థితి ఇలా..

- మండలపరిధిలోని రంగారెడ్డిపల్లి నుంచి పరిగి వెళ్లే దారి పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. మోకాలిలోతు గుంతలు పడడంతో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. మరమ్మతులకు రూ. 1.3 కోట్లు ఏడాదిన్నర క్రితం మంజూరు చేశారు. టెండర్లు కూడా పూర్తయ్యాయి. టెండర్ దక్కించుకున్న వారు కాలయాపన చేస్తుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చామని చెప్పడం తప్ప అధికారులు పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని పలువురు ఆరోపిస్తున్నారు.
- వెన్నాచేడ్ నుంచి లింగాయిపల్లి వరకు బీటీ రోడ్డు నేటికి ప్రారంభం కాలేదు. రూ. 1.4కోట్లు ఆరు నెలల క్రితం మంజూరు కాగా మోక్షం కలగలేదు.
- చెల్మిల్ల గేటు నుంచి జిన్నారం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.55 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పరిచారు. ఏడాదిన్నర గడుస్తున్నా బీటీ వేయలేదు. అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు చేపట్టాల్సిన పాలకులు వత్తాసు పలికారే తప్ప పనుల పురోగతికి కృషి చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రోడ్డుపై వెళ్లలేక పోతున్నాం...

మేం నిత్యం ప్రయాణించే రోడ్డు గుంతలు పడి దారుణంగా మారింది. బైక్‌పై వెళ్లాలంటే భయం వేస్తోంది. వర్షకాలంలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. ఎవరూ మాగోడు పట్టించుకోవడం లేదు. ఇప్పటికై నా రోడ్డు నిర్మాణం పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలి.
– మొగులయ్య, లింగాయిపల్లి

ప్రారంభించేలా చూస్తాం

రంగారెడ్డిపల్లి రోడ్డును త్వరితగతిన ప్రారంభించాలని పలుమార్లు కాంట్రాక్టరును ఆదేశించాం. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. వేరే చోట పనుల చేస్తున్న కారణంగా ఆలస్యం చేస్తున్నారు. ఉన్నతాధికారులతో సమీక్షించి నోటీసులు అందజేస్తాం. పనులు ప్రారంభిచేలా చూస్తాం.
– సంధ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, మహబూబ్‌నగర్

నివేదికలు రూపొందిస్తున్నాం

అసంపూర్తి రోడ్లు, ప్రారంభం కాని రోడ్లు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించాం. గతంలో పనిచేసిన పనులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. దీని కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్లను అడిగితే పెండింగ్ బిల్లులు చెల్లిస్తే పనులు చేస్తామంటున్నారు. ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించాం. అన్ని నివేదికలు తయారు చేస్తున్నాం. త్వరలో రోడ్డు నిర్మాణాలు పూర్తయ్యేలా చూస్తాం.
– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

ప్రజల్లో భక్తిభావం పెంపొందింది


అయ్యప్ప భక్తులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

రాజాపూర్: ప్రజల్లో భక్తి భావం పెంపొందిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి గూడలో శబరిమలకు వెళ్తున్న మాలాధారుల ఇరుముడి కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మాలవేసుకోవడం ద్వారా భక్తితో పాటు నియమనిష్టలతో ఒంటి పూట భోజనం చేయడంద్వారా శరీరానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. మాలాధారుల యాత్ర క్షేమంగా జరగాలని ఆకాంక్షించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ఎంపీ సీటు బీసీలకే


మాట్లాడుతున్న శాంతకుమార్

పాలమూరు: మహబూబ్‌నగర్ పార్లమెంట్ సీటును బీజేపీ అధిష్టానం ఈసారి బీసీ నేతకు ఇచ్చే అవకాశం ఉందని, 14ఏళ్ల పాటు పార్టీలో పని చేస్తున్నా తనకు అవకాశం ఇస్తారన్న నమ్మకం ఉందని రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ అన్నారు. జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టికెట్ ఇస్తారనే నమ్మకంతో ఇప్పటికే ప్రచారం మొదలు పెట్టినట్లు వివరించారు. వందల ఏళ్ల పోరాటం తర్వాత సుప్రీంకోర్టు తీర్పుతో అయోధ్య రాముడి ప్రతిష్ఠాపన ఈనెల 22న జరగనుందని అన్నారు. దేశంలోని ప్రజలు అందరూ ఒకేరోజు అక్కడకు వెళ్లలేరని అందువల్ల.. ఆరోజున ప్రతి ఒక్కరూ ఇళ్లలో ఐదు రామ జ్యోతులు వెలిగించాలని కోరారు. దీపావళి మాదిరిగా జరుపుకోవాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై కొంత సమయం ఇచ్చిన తర్వాత ప్రశ్నిస్తామన్నారు. జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, నేతలు కృష్ణవర్ధన్‌రెడ్డి, సత్యం, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణయాదవ్, బిచ్చిరెడ్డి, చిన్న వీరయ్య, మఠం మయూర్‌నాథ్ పాల్గొన్నారు.

గడప గడపకూ అక్షతలు


జిల్లాకేంద్రంలో అక్షతల పంపిణీ


వెన్నాచేడ్‌లో..

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షతలను గడపగడపకూ పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా అక్షతలతో పాటు రామమందిరం ఫోటో, కరపత్రం ఇస్తున్నారు. మంగళవారం బోయపల్లిగేటు ఏరియాలో శ్రీవీరహనుమాన్ యువజన సంఘం అధ్యక్షుడు హరికృష్ణ ఆధ్వర్యంలో అయోధ్య రామయ్య అక్షతలను పంపిణీ చేశారు. రాఘవేంద్ర, శ్రీను, నిరంజన్, రాము, రాజేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: వెన్నాచేడ్‌లో అయోధ్య రాముడి అక్షతలను ఇంటింటికీ వితరణ చేశారు. సీతారామ భజనమండలి సభ్యులతో పాటు గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సత్యసాయి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, మహిళా విభాగం కన్వీనర్ విజయమ్మ, భజన మండలి సభ్యులు రాములు, చంద్రయ్య, అంజిలయ్య, రాజప్ప, ఎల్లప్ప, నరేందర్ పాల్గొన్నారు.

స్పోక్‌పర్సన్‌గా శ్రీధర్

నవాబుపేట: ఇంటర్‌నేషనల్ సైన్స్‌ఫేర్ స్పోక్‌పర్సన్‌గా మండల పరిధిలోని యన్మన్‌గండ్ల జెడ్పీస్కూల్ ఉపాధ్యాయుడు శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామక పత్రం అందినట్లు ఆయన వివరించారు. శ్రీధర్‌ను మండల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

సద్వినియోగం చేసుకోండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఫయాజ్ అల్మాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. విభాగం అసెంబ్లీ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఖురేషి, పట్టణ అధ్యక్షుడు గులాం దస్తగీర్ జహీర్, నాయకులు షా ఫైసల్, పీర్ సాధిక్, అలీం, ఫహీం, తాహెర్, మూసా చావూష్, అలీ పాల్గొన్నారు.

మరో 8 వార్డుల్లో నేడు..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ప్రజాపాలన'లో భాగంగా ఐదో రోజు బుధవారం మరో ఎనిమిది వార్డుల్లో 'అభయహస్తం' దరఖాస్తులను అధికారులు స్వీకరించనున్నారు. పదోవార్డు పరిధిలోని క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ వార్డు కార్యాలయంలో, 22వ వార్డులోని భగీరథకాలనీ కమ్యూనిటీ హాలులో, 30వ వార్డులోని నీలకంఠ స్వామి దేవాలయం వద్ద కమ్యూనిటీహాలు (వీరన్నపేట)లో, 32వ వార్డులోని పండుగ సాయన్న టెంపుల్ వద్ద కమ్యూనిటీ హాలు (వీరన్నపేట)లో కౌంటర్లను ఏర్పాటు చేశారు. 34వ వార్డులోని మహిళా విశ్రాంత భవనం (మార్కెట్‌యార్డు - కొత్తగంజి) లో, 36వ వార్డులో భోజన వసతి కేంద్రం (న్యూ క్యాంటీన్, మార్కెట్‌యార్డు - కొత్తగంజి) లో, 37వ వార్డులోని సద్దలగుండు కమ్యూనిటీ హాలులో, 41వ వార్డులోని షాషాబ్‌గుట్ట దర్గా షెడ్ వద్ద దరఖాస్తులు స్వీకరించనున్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి


ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళ సంఘాల బలోపేతానికి డీఆర్‌డీఓ అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో డీఆర్‌డీఓ యాదయ్య తన శాఖ సిబ్బందితో ఎమ్మెల్యేను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మహిళ కోసం అమలు చేసే పథకాలను వారికి చేరేలా కృషి చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఏపీడీ శారధ, డీపీఎంలు నాగమల్లిక, కృష్ణయ్య, సలోమీ, రవి, కిషోర్, సునీల్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ అధికారుల కోసం నడిచే అద్దె వాహనాల పెండింగ్ బిల్లులను విడుదల చేయించి ఆదుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ తదితరులు కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. రవి, రమేష్, కిషోర్, సాజిద్ పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్లతో ప్రజాప్రతినిధులు, ఫోరం నాయకులు

నవాబుపేట: సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రయ్య మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు అని హక్కులు అందేలా సహకరించాలని అన్నారు. సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, హన్మంతు, వెంకటేష్, ఫోరం జిల్లా నాయకులు ఎల్లారెడ్డి, నర్సింహులు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


తువ్వగడ్డ తండాలో ప్రజాపాలన గ్రామసభలో దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్


పాలకొండలో..


ఉడిత్యాలలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్


శేరివెంకటాపూర్‌లో

సాక్షినెట్‌వర్క్: గ్రామ, పట్టణ స్థాయిలో ప్రజా పాలన కోసం ఏర్పాటు చేసిన అన్ని కౌంటర్లలో పూర్తిస్థాయిలో సిబ్బంది ఉండి దరఖాస్తులు స్వీకరిస్తుండడంపై కలెక్టర్ రవినాయక్ సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం రూరల్ మండల పరిధిలోని తువ్వగడ్డ తండాలో సర్పంచ్ కె.శంకర్ అధ్యక్షతన జరిగిన గ్రామసభకు హాజరై దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో మొత్తం 6,759 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఇందులో 'అభయహస్తం' కింద 6,585, ఇతర దరఖాస్తులు 174 వచ్చాయి. రెండో వార్డులో 530, ఎనిమిదిలో 420, తొమ్మిదిలో 500, 12లో 740, 14లో 1,469, 15లో 1,007, 42లో 806, 45లో 1,167, ఇతర దరఖాస్తులు 120 అందాయి. ఇప్పటివరకు 32 వార్డుల్లో అభయహస్తం కింద 24,430, ఇతర దరఖాస్తులు 566..మొత్తం 24,996 దరఖాస్తులు వచ్చినట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. ధర్మాపూర్‌లో మంగళవారం దరఖాస్తుల స్వీకరణ పరిశీలించారు. తహసీల్దార్ సుందర్‌రాజ్, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, గిర్దావర్ క్రాంతికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్ మండల పరిధిలోని ఉడిత్యాలలో ప్రజా పాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. దరఖాస్తు దారులకోసం ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. మండల ప్రత్యేక అధికారి బాబురావు, ఎంపీడీఓ కృష్ణారావు తదితరులు ఉన్నారు.

బాలానగర్ పరిధిలోని ఉడిత్యాలలో 923, పెద్ద బాయి తండాలో 474, గంగధారిపల్లిలో 463 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ విజయకుమారి ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోయిల్‌కొండ మండల ప్రత్యేకాధికారి మధుసుదన్‌గౌడ్, ఎంపీడీఓ జయరాములు అన్నారు. మంగళవారం మండలంలోని శేరివెంకటాపూర్, మోదీపూర్, గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన గ్రామసభలో వారు దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో ఇప్పటివరకు 24 గ్రామపంచాయితీలలో 14,567 దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు.

గండేడ్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో 1,656 దరఖాస్తులు వచ్చాయి. మంగళవారం సల్కర్‌పేట్, రెడ్డిపల్లి, జిన్నారం, జిన్నారం తండాల్లో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంఈఓ వెంకటయ్య, జితేందర్‌రెడ్డి, ఆశిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్‌లో పరిధిలో 1,967 దరఖాస్తులు వచ్చాయి. గాధిర్యాల్‌లో 884, ఆముదాలగడ్డ తండాలో 153, వెంకటరెడ్డిపల్లిలో 621, అన్నారెడ్డిపల్లిలో 309 దరఖాస్తులు స్వీకరించారు. ప్రత్యేకాధికారి శత్రునాయక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శమంతకమణి పాల్గొన్నారు.

మిడ్జిల్ మండలంలో మంగళవారం వస్పులలో370, రాణిపేట్‌లో318 , కంచన్‌పల్లిలో361, భైరంపల్లిలో326 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రాజు నాయక్ తెలిపారు. వస్పులలో ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ ఉన్నారు.

నవాబుపేట పరిధిలోని తీగలపల్లిలో స్పెషల్ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీలత, సర్పంచ్‌లు వెంకటేష్, చెన్నప్ప, నారాయణ, కాశన్న, రాజు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అడ్డాకుల పరిధిలో శాఖాపూర్‌లో 453, గుడిబండలో 595, తిమ్మాయిపల్లి తండాలో 355, రాంచంద్రాపూర్‌లో 102 దరఖాస్తులు అందినట్లు సూపరింటెండెంట్ శివప్రసాద్ తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, డీఎఫ్ఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

వెంకట్రాంరెడ్డి సేవలు మరవలేనివి



గురుకుంటలో నివాళి అర్పిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు తదితరులు

నవాబుపేట: మన్నె వెంకట్రాంరెడ్డి చేసిన సేవలు మరవలేనివని ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. మంగళవారం మండల పరిధిలోని గురుకుంటలో ఎంపీ సోదరుడు, టీటీడీ బోర్డు మాజీ డైరెక్టర్ జీవన్‌రెడ్డి తండ్రి వెంకట్రాంరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని చిత్రపటానికి నివాళి అర్పించారు. వెంకట్రాంరెడ్డి సూచనలతోనే గురుకుంట గ్రామాన్ని ఎంఎస్ఎన్ కంపెనీ ద్వారా దత్తత తీసుకుని అభివృద్ధికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణమ్మ, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి, మాజీ మంత్రులు డీకే అరుణ, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మల్లురవి నాయకులు తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి భానుప్రకాష్ రెడ్డి (22) మృతి చెందడంతో మంగళవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు రబ్బానీ, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు, గౌస్, మల్లికార్జున్‌రెడ్డి ఉన్నారు.

అడ్డాకుల: పోల్కంపల్లి సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి ఇటీవల మోకాలు సంబంధిత ఆపరేషన్ చేయించుకుని మహబూబ్‌నగర్‌లోని ఆయన నివాసంలో కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని సాయి విజయకాలనీలోని తోట్ల హనుమాన్ ఆలయంలో మంగళవారం స్వామివారి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, సిందూరలేపనం, హనుమాన్ అష్టోత్తరం, పుష్పాలంకరణ, భజన, నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పెట్రోల్ బంకుల్లో బారులు


జడ్చర్లలో పెట్రోల్‌బంకులో క్యూ


వాహనదారులను కంట్రోల్‌చేస్తున్న పోలీసులు


బాలానగర్‌లో..

జడ్చర్ల టౌన్: పెట్రోట్యాంకర్ల డ్రైవర్ల సమ్మె కారణంగా హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో మంగళవారం పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడటంతో పట్టణంలోనూ బంకుల వద్ద వాహనదారులు బారులు తీరారు. పెద్ద సంఖ్యలో పడిగాపులు కాశారు. ముఖ్యంగా సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వాహనదారులు పెద్ద సంఖ్యలో రావటంతో బంకుల్లో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. చివరకు నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది. ట్యాంకర్ డ్రైవర్లు సమ్మె విరమించారని, ఎలాంటి కొరత రాదని నిర్వాహకులు చెబుతున్నా వాహనదారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొన్నిచోట్ల వాహనదారులలో కొంత వాగ్వాదం జరిగింది.

బాలానగర్: మండల పరిధిలోని పలు పెట్రోల్ బంకుల వద్ద సాయంత్రం నుంచి వాహనదారుల క్యూ పెద్ద మొత్తంలో కనిపించింది. ఈ నేపథ్యంలో కొన్ని పెట్రోల్ బంకులలో ఇప్పటికే నో స్టాక్ బోర్డులు సైతం పెట్టేశారు.

పాఠశాల తనిఖీ

కృష్ణా: మండలంలోని గుర్జాల్‌లో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు.. గత ప్రభుత్వం కనీసం పాఠశాలను అభివృద్ధి చేయలేకపోవడం దారుణమని అన్నారు. త్వరలోనే ఈ పాఠశాలకు నూతన భవనాన్ని మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అదే విధంగా పాఠశాలకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు రవిగౌడ్, ఆనంద్‌గౌడ్, శివరాంరెడ్డి ఉన్నారు.

